సైలెన్స్ లేకుంటే వాతే

- అధిక శబ్దం వచ్చేలా బైక్ సైలెన్సర్లలో మార్పులు చేస్తున్న పోకిరీలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు
- ఆకతాయి చేష్టలకు చెక్ పెట్టేలా ట్రాఫిక్ పోలీసుల కార్యాచరణ
- వారంలో రెండురోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా చర్యలు
- పట్టుబడితే కేసులు, వాహనాల సీజ్

ద్విచక్ర వాహనాలపై రయ్యిన దూసుకెళ్తున్న కుర్రకారు తీరు శృతి మించుతోంది. ట్రాఫిక్ పోలీసులు కర్నూలులో పది వాహనాలను తనిఖీ చేస్తే వాటిలో ఐదింటికి నిబంధనలు అతిక్రమించి భారీ శబ్దం వచ్చేలా ఏర్పాటు చేసుకున్న సైలెన్సర్లు ఉంటున్నాయి. నాలుగు రోజుల క్రితం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఒకే రోజు 25 వాహనాలు ఈ విధంగా పట్టుబడ్డాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అధిక శబ్దాలు వచ్చేలా బైక్‌లతో ఆకతాయిల తీరు అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురిచేస్తోంది.


పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు


అధిక శబ్దం చేసే సెలెన్సర్‌ను తొలగించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కర్నూలు: బైక్‌ల తయారీ కంపెనీలు ప్రభుత్వ నిబంధనల మేరకు తక్కువ శబ్దం, తక్కువ పొగ వచ్చేలా తగిన జాగ్రత్తలతో వాహనాలను తయారు చేస్తాయి. అయితే కొందరు పోకిరీలు అత్యుత్సాహంతో బైక్‌ల సైలెన్సర్ల మఫ్లర్లకు రంధ్రాలు చేసి విజిల్ లాంటి పరికరాన్ని అమర్చి ఎక్కువ శబ్దం వచ్చేలా చేస్తున్నారు. మరికొందరు యువకులు టప్‌మని భారీ శబ్దాలు వచ్చే వాటిని అమర్చుకుని హల్‌చల్ చేస్తుండగా ఇంకొందరు పిల్లలు ఏడ్చినట్లు, కుక్కలు, పందులు, గాడిదలు అరచినట్లుగా, బాంబులు పేలినట్లుగా.. ఇలా వివిధ శబ్దాలు వచ్చేలా మార్పులు చేస్తున్నారు. ఇందుకోసం వాహనానికి ప్రత్యేకంగా బటన్లు ఏర్పాటు చేస్తున్నారు. అకస్మాత్తుగా పెద్ద శబ్దం రావడంతో పక్కన వెళ్లే వాహనదారులు ఉలిక్కిపాటుకు గురై ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఆకతాయిలు జంతువుల అరుపులను పోలిన శబ్దం వచ్చేలా పరికరాలను బిగించుకుని ట్రాఫిక్‌లో దూసుకుపోతున్నారు. ఇది వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. సమీపంలోకి వచ్చి శబ్దం చేస్తుండటంతో వాహనదారులు జడుసుకుంటున్నారు. జిల్లా కేంద్రం కర్నూలులోనే ఇలాంటి వాహనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. సాధారణంగా ద్విచక్ర వాహనాల నుంచి 80 డెసిబుల్ కంటే తక్కువ శబ్దం రావాలి. బీఎస్–6 వాహనాల నుంచి 16 నుంచి 18 డెసిబుల్ వరకే శబ్దం వస్తుందని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. బీఎస్–4 పాత వాహనాలకు కొంత ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లు ఉన్నాయి. వాటికి మరింత శబ్దం వచ్చేలా మార్పులు చేసి నిబంధనలను అతిక్రమిస్తున్నారు. భారీ శబ్దం వచ్చేలా చేసేందుకే రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేస్తున్నారు.

అన్ని వర్గాలకు ఇబ్బందే...

వాహనాల భారీ శబ్దాలతో గుండెజబ్బులతో బాధపడేవారు, చిన్నపిల్లలు, రక్తపోటు, శ్వాసకోస వ్యాధులు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గర్భిణులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని ద్వారా వినికిడి శక్తి కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా చెవి 120 డెసిబుల్ వరకే శబ్దం భరించగలుగుతుంది. అంతకు మించితే కర్ణభేరికి ప్రమాదమని డాక్టర్లు సూచిస్తున్నారు. వాహన శబ్దాల సమస్య తీవ్రమవ్వడంతో ట్రాఫిక్ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. వారంలో రెండు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శృతి మించి వ్యవహరిస్తున్న కుర్రకారు తీరును కట్టడి చేసేలా కార్యాచరణ రూపొందించారు. అధిక శబ్దం వచ్చే వాహనాలను పట్టుకుని పర్యావరణ పరిరక్షణ చట్టం కింద వాహనదారులకు జరిమానా విధిస్తున్నారు.

కట్టడికి చర్యలు...

రద్దీ కూడళ్లు, విద్యాసంస్థల నుంచి విద్యార్థులు బయటకు వచ్చి వెళ్లే సందర్భంలో ఒకరిద్దరు పోకిరిగాళ్లు ద్విచక్ర వాహనాలపై రయ్ మంటూ దూసుకెళ్తున్నారు. కళాశాలలు వదిలినప్పుడు గుంపులో


సైలెన్సర్ మార్పు చేసిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు

ఒక్కసారిగా ఏదో పెద్ద శబ్దం వినిపించడంతో అక్కడున్న విద్యార్థులందరూ కంగారు పడతారు. ఆ తర్వాత ఏదో వెకిలి చర్య అని గుర్తించి విస్తుపోతారు. ఇటీవల పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పటికీ వీటికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడకపోవడంతో అధిక శబ్దాల సైలెన్సర్లు ఉన్న వాహనాలను కట్టడి చేసేందుకు కార్యాచరణను రూపొందించారు. వాహన సైలెన్సర్లలో మార్పులు చేయవద్దని ఎస్పీ బిందుమాధవ్ స్వయంగా ఇటీవల ప్రత్యేక సమావేశం నిర్వహించి మెకానిక్‌లకు సూచించారు. ట్రాఫిక్ పోలీసులు కూడా వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. డబ్బులకు ఆశ పడి కొందరు మెకానిక్‌లు సైలెన్సర్ల మార్పు చేస్తున్నట్లు గుర్తించి తీవ్రంగా హెచ్చరించారు.

వాహనాలను జప్తు చేస్తాం



ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా కంపెనీలు ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లను ఏర్పాటు చేస్తుంటాయి. వాటిని తొలగించడం, మార్పు చేయడం, అధిక శబ్దం వచ్చేలా అమర్చుకోవడం చట్టరీత్యా నేరం. అలాంటి వాహనాలను ఇకపై జప్తు చేసి రవాణా శాఖకు అప్పగిస్తాం. భారీ శబ్దాలు చేసుకుంటూ తిరిగే ద్విచక్ర వాహనదారులపై ఇకపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటికే అలాంటి వాహనాలను సీజ్ చేస్తున్నాం. – మన్సురుద్దీన్, ట్రాఫిక్ సీఐ

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా నేడు సదస్సు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి తెచ్చిన సవరణలను వ్యతిరేకిస్తూ శనివారం గుంటూరులోని నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ సుభాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుంటూరులోని గుర్రంజాషువా విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరుగనున్నట్లు చెప్పారు. సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ముస్లిం మైనార్టీలు తరలిరావాలని కోరారు. వక్ఫ్ ఆస్తులను ప్రైవేట్ పరంచేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.

రేపు గణేష్ మహోత్సవ సమితి సమావేశం

కర్నూలు కల్చరల్: శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి సమావేశం ఈనెల 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక వినాయక్ ఘాట్‌లో నిర్వహించనున్నట్లు సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు పేర్కొన్నారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల గురించి సమావేశంలో చర్చిస్తామన్నారు. నగరంలోని వివిధ వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డుకు శంకుస్థాపన

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపల గ్రామం నుంచి గార్గేయపురం గ్రామం వరకు రూ.4.8 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

18న పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: ప్రముఖ హార్మోనిస్టు జనార్దన్‌రెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా ఈ నెల 18న రాత్రి 9 గంటలకు మార్కెట్ యార్డ్‌లోని రైతు కళా ప్రాంగణంలో ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు విశ్వకళ సమితి కన్వీనర్ హనుమంతరావు చౌదరి తెలిపారు. మయసభ, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి, సత్య హరిచంద్ర నాటకాల్లోని సన్నివేశాలను ప్రముఖ కళాకారులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి


హ్యాండ్‌బాల్ జట్టుకు క్రీడాదుస్తులు పంపిణీ చేసిన భూపతిరావు

కర్నూలు (టౌన్): కదిరి పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో.. రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జట్టుకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలను అవకాశంగా మలుచుకొని ప్రతిభ చాటాలన్నారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

పట్టుడు కర్రలు స్వాధీనం


పట్టుబడిన వాహనం వద్ద అటవీ శాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: పట్టుడు కర్రలు, ఇతర అటవీ ఉత్పత్తులను అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎం.సూర్యచంద్రరాజు తెలిపారు. 15వ తేదీ అర్ధరాత్రి కర్నూలు పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేస్తుండగా బొలెరో పిక్ అప్ నంబర్ ఏపీ 21 టీఎక్స్ 4099 వాహనంలో అక్రమంగా అటవీ ఉత్పత్తులను రవాణా చేస్తుండగా తడకనపల్లి గ్రామం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డి.మౌలాలి, ప్రొటెక్షన్ వాచర్ జి.వెంకటేష్ పట్టుకున్నారన్నారు. వీటి విలువ రూ.90 వేలు ఉంటుందని చెప్పారు. వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ కార్యాలయానికి తరలించామన్నారు. అక్రమంగా అటవీ సంపదను తరలిస్తే వాహనాన్ని జప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ సీఎంకు ఘన నివాళి


కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సూర్యప్రకాష్‌రెడ్డి

కర్నూలు: నగరంలో హంద్రీ నది ఒడ్డున ఉన్న కిసాన్ ఘాట్‌లో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతి కార్యక్రమం నిర్వహించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు అనుచరులు, రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఉదయం పాత కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న కోట్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కిసాన్ ఘాట్‌కు చేరుకుని ఆయన సమాధిపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, రాంబాబు రెడ్డితో పాటు కోట్ల అభిమానులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోట్ల విజయభాస్కరరెడ్డి జయంతి కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు కోట్ల విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ పాల్గొన్నారు.

అన్యాయంగా పని నుంచి తొలగించారు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌లో మూడేళ్లుగా పనిచేస్తున్న తమను విధుల తొలగించి అన్యాయం చేశారని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలోనూ తాము రోడ్లను ఊడ్చి, కాల్వలను శుభ్రం చేశామన్నారు. ఇప్పుడు ఎలాంటి కారణాలు చూపకుండా పని తొలగించారని, తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

– కర్నూలు నగర పాలక సంస్థలో తొలగించిన 200 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తొలగించిన వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవడానికి మంత్రి టీజీ భరత్ ప్రయత్నించడం అన్యాయమన్నారు.

వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): రోగుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. జూనియర్ డాక్టర్లు నిరవధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై శుక్రవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ పరిధి నుంచి 16 మంది వైద్యులు వచ్చి విధులు నిర్వహిస్తున్నారని, ఇందులో ఆరుగురిని క్యాజువాలిటీలో నియమించినట్లు తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి 10 – 15 మంది నాన్ క్లినికల్ వైద్యులు వస్తారన్నారు. వారిని క్యాజువాలిటీతో పాటు ఏఎంసీ, చిన్నపిల్లల విభాగం, ప్రసూతి విభాగాల్లో నియమించనున్నట్లు తెలిపారు. నర్సింగ్ విద్యార్థినుల సేవలను వినియోగించుకుంటామని, అవసరమైతే పారామెడికల్ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి సిబ్బందిని రప్పిస్తామన్నారు. పరిస్థితిని సమీక్షించేందుకు ఆసుపత్రిలో 10 మందితో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అవసరమైతే ప్రొఫెసర్లు అత్యవసర వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మె నేపథ్యంలో వైద్యుల పనితీరుపై ఇంటెలిజెన్స్ నిఘా ఉందని, వారు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదిక ఇస్తున్నట్లు తెలిపారు. హెల్త్ మినిస్టర్, సెక్రటరీ పరిస్థితిని గమనిస్తున్నారని చెప్పారు. ఆయా విభాగాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత హెచ్‌ఓడీలదేనని, రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

18 నుంచి పర్యావరణ రక్షాబంధన్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శత వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో పర్యావరణ రక్షాబంధన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బుధవారపేట కేశవ మెమోరియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ ఏడాది పర్యావరణ రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మనిషి జీవించేందుకు 832 చెట్లు అవసరం కాగా దేశంలో ఒక్కొక్కరికి 28 చెట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి ఏడాది తర్వాత జన్మదినం జరుపుకునేలా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా సహ సంఘ చాలక్ సూర వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు పర్యావరణ రక్షాబంధన్ జరుపుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో 100 మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. జిల్లా సంఘ చాలక్ ఎన్వీఎస్ గుప్త, జిల్లా ప్రచార ప్రముఖ్ విశ్వనాథ్, నగర ప్రచార ప్రముఖ్ చంద్రశేఖర్, మురళీకృష్ణ, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కర్నూలు (టౌన్): ఈనెల 29 వ తేదీన నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని యోగా హాలులో క్రీడా సంఘాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా సంఘాల కార్యదర్శులతో గుర్తింపు ఉన్న క్రీడలను నిర్వహించాలన్నారు. త్వరలోనే తేదీలు ఖరారు చేసి క్రీడలను నిర్వహిస్తామని చెప్పారు.

నాపరాయి లారీ సీజ్

కర్నూలు (టౌన్): బేతంచెర్ల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా నాపరాయిని తరలిస్తున్న లారీని శుక్రవారం మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. కర్నూలు శివారులోని నన్నూరు టోల్‌ప్లాజా వద్ద నాపరాయితో వస్తున్న లారీని మైనింగ్ అధికారులు నిలిపివేశారు. రికార్డులను పరిశీలించారు. ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించినట్లు జిల్లా గనుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు. తనిఖీల్లో విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు

కర్నూలు (లీగల్): ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. ఆయన శుక్రవారం పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా జైలులో ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందించే వివరాలతో బ్యానర్, ఇందుకు ఎలా దరఖాస్తు చేయాలో వివరించే పోస్టర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, పర్యవేక్షణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైలు పర్యవేక్షణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం పంచలింగాలలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. రిజిస్టర్లు, భవన పరిస్థితి, వైద్యపరీక్షలు, మౌలిక సదుపాయాలు, పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. బాలల చట్టాల, ఉచిత న్యాయ సేవల గురించి తెలియజేశారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

అలాగే కర్నూలులోని వర్క్కూరు, గూడూరు, కల్లూరు, ఓర్వకల్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను తనిఖీ చేశారు.

'మంత్రి గారూ.. మా కడుపు కొట్టొద్దు'


పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): చాలీచాలనీ వేతనాలతో నిత్యం ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మురుగు కాల్వ పనులు చేస్తున్న తమను పని నుంచి తొలగించాలని జిల్లా మంత్రి చెప్పడం బాధాకరమని కార్మికులు శివన్న, కుమారి, కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కడుపు కొట్టవద్దన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదురుగా మురుగు కాల్వలు శుభ్రం చేసే కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2021 నుంచి నగరంలోని అన్ని డ్రైయిన్లలో పూడికతీత పనులు చేస్తున్నామన్నారు. తమకు ఇచ్చే రూ.10 వేలతోనే జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పుడు తమను తొలగించి వేరే వాళ్లను నియమించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న వారి వద్దకు మేయర్ బీవై రామయ్య వెళ్లి మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వరప్రదాయినీ వరలక్ష్మీ


వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు


చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు


సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహాగౌరీ


వరలక్ష్మీ అమ్మవారు


ఓల్డ్‌సిటీ అమ్మవారి శాలలో..


బండిమెట్ట అంబా భవానీ ఆలయంలో..


ప్రత్యేక అలంకరణలో లలితా సుందరేశ్వరి


లలితా పీఠంలో వరలక్ష్మీ అమ్మవారు


ఊంజల్ సేవలో వరలక్ష్మీ మాత

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన ఆలయాలు, అమ్మవారి ఆలయాలతో పాటు భక్తుల గృహాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అమ్మవారి కథలను వివరించారు. వేలాది మంది ముత్తయిదువులు సమీప ఆలయాలకు వెళ్లి అమ్మవారి సమక్షంలో వ్రతాన్ని నోచారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకోవడంతో పాటు అమ్మవారికి ఒడి బియ్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. జిల్లాలో శ్రీశైలం, మహానంది, అహోబిలం, నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయం, మంత్రాలయం, ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం, నాగలాపురం సుంకులాపరమేశ్వరీ ఆలయం, వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయాలతో పాటు కర్నూలు నగరం సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలోని చౌడేశ్వరీ దేవి ఆలయం, పాతనగరంలోని చిన్న అమ్మవారి శాల, పెద్దఅమ్మవారి శాల, నిమిషాంబదేవి ఆలయం, కాళికాంబ దేవి ఆలయం, మాతా అంబా భవాని ఆలయం, లలితా సుందరేశ్వర ఆలయం, అరోరా నగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, వీఆర్ కాలనీ, కృష్ణానగర్, సంకల్‌బాగ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయాలు, దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయాల్లో వ్రతాలు ఆచరించారు.